భం
గురువాణి
27 ఆగస్టు, 2026 సంచిక-266



# ముగ్గురు సాక్షులు

జీవుడు ఈ లోకాన్ని విడిచి పరలోకాన్ని చేరినప్పుడు అక్కడ పరమాత్ముడు ఆ జీవున్ని ఇలా అడుగుతాడు అంట, నీ గురించి సాక్ష్యము చెప్పే వాళ్ళని తీసుకొని వచ్చినావా అని. అప్పుడు జీవుడు అంటాడు లేదు స్వామి తీసుకురాలేదు అని. అయితే పోయి సాక్షులను తీసుకొనిరా అని పరమాత్ముడు అంటాడు. జీవుడు మొదటి సాక్షి దగ్గరికి వచ్చి, అడుగుతాడు, నీవు నా గురించి ఆ పరమాత్ముని దగ్గర సాక్ష్యం చెప్పగలవా అని. ఆ మొదటి సాక్షి అంటాడు, నేను సాక్ష్యమేమో ఇవ్వగలను, అయితే నేను ఉన్న స్థానము నుంచి కదలిరాను. రెండవ సాక్షిని అడిగితే నేను న్యాయ విచారణ జరిగే కోర్టు వరకు మాత్రమే రాగలను కానీ లోపలికి ప్రవేశించలేను అని అంటాడు. ఇక మూడవ సాక్షిని అడిగితే నేను సిద్ధంగా ఉన్నాను, నీవు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి నీ గురించి సాక్ష్యం చెబుతాను అని అంటాడు.

ఈ ముగ్గురు సాక్షులు జీవితంలో మనకు తారసపడతారు, మొదటి సాక్షి కదలని సాక్షి, ఇది మనం సంపాదించినటువంటి ధనము, ధాన్యము, ఇల్లు, భూమి. ఇవి ఎక్కడ ఉన్నాయో అక్కడే ఉంటాయి, కదలి రాలేవు. ఇక రెండవ సాక్షి మనకు శాశ్వతమైన సుఖం ఇస్తాయి అని భ్రమించినటువంటి మన భార్య - పిల్లలు. వీరు ఎంతవరకు వస్తారు అంటే స్మశానం వరకు మాత్రమే వస్తారు. అంతకుమించి ముందుకు రాలేరు. ఇక మూడవ సాక్షి మనము చేసినటువంటి మంచి పనులు మరియు చెడు పనులు. ఇవి మన వెంట ఉంటాయి. ఇవి మాత్రమే మన వెంట వచ్చి ఆ పరమాత్మునికి సాక్ష్యం ఇవ్వగలవు.

కనుక శిష్య భక్తాదులారా ధనము, ధాన్యము, ఇల్లు, ఇల్లాలు, పిల్లలు అనే వ్యామోహాన్ని పక్కన పెట్టండి. ఇవి ఏవి మీ వెంట రావు. ఇక మీ వెంట వచ్చేవి మీరు చేసిన పుణ్యకార్యాలు, దైవకార్యాలు, మంచి పనులు మాత్రమే. కనుక మీరందరూ కూడా మన వెంటరాని వాటికి ప్రాకులాడకుండా పుణ్యకార్యాలు చేస్తూ ఆ దైవ మార్గంలో ప్రయాణించి మీ జీవితాన్ని ధన్యం చేసుకోగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.